క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

సాలూరు: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయవర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం పదిన్నర గంటలకు రాజన్నదొర స్వగృహానికి రావాలని పేర్కొన్నారు. అక్కడ నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్డు కూడలి వద్దకు ర్యాలీగా వెళ్లి, రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపాయి.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను పార్వతీపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద రాజన్నకు నివాళులర్పించి, పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



ఏగోటివలసలో కాలువల్లో పూడికలు తీస్తున్న కూలీలు

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన పనులను ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ఏగోటివలస, పాపమ్మవలస, చినబోగిలి, పెదబోగిలి గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయని చెప్పారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపడుతున్నట్లు తెలిపారు.

చేయూత డబ్బులు జమ చేయాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్



తోట జీవన్న

పార్వతీపురం టౌన్: చేయూత లబ్ధిదారులకు వెంటనే డబ్బులు జమ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడి ప్రవేశపెట్టిన జగనన్న చేయుత పథకం కొంతమందికి వచ్చి, కొంతమందికి రాకపోవడంతో మహిళలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారన్నారు. జగనన్న చేయూత పథకం ద్వారా అందాల్సిన రూ. 18,750 అందక మహిళలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. జిల్లా వెలుగు పీడీ, సిబ్బంది సరైన సమాధానం చెప్పాలని కోరారు.

సత్కారం

వీరఘట్టం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన రెల్లయ్యను ఎస్సై షేక్ ఫక్రుద్దీన్‌తో పాటు స్టేషన్ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో చాకచక్యంగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన రెల్లయ్యకు పదోన్నతి రావడం ఆనందంగా ఉందన్నారు. రెల్లయ్య మాట్లాడుతూ.. ఎస్సైగా పదోన్నతి పొందడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇన్నాళ్లు తనకు విధి నిర్వహణలో సహకరించిన ఎస్సైకు, సహచర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణంనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థికసాయం చేస్తున్న భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు

భామిని: మండలంలోని సతివాడకు చెందిన పున్నాన లక్ష్మణరావు(45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుని భార్య జయలక్ష్మి, ఇద్దరు పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మృతిని భార్య జయలక్ష్మికి ఆదివారం రూ.20 వేలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ రూరల్: మాదిగల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీఎస్ అహర్నిశలు శ్రమిస్తోందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు అలజంగి చిన్నారావు అన్నారు. స్థానిక కస్పావీధిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేసి నినాదాలు చేశారు. తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న కృషిని వివరించారు.

అప్రమత్తతే ప్రధానం..

- వరికి తెగుళ్ల బెడద
- అవగాహన తప్పనిసరి
- సకాలంలో మందులు వాడితే తెగుళ్ల నివారణ

సీతానగరం:

వరి పంట సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ సకాలంలో మందులు పిచికారీ చేస్తే పంటను తెగుళ్ల బెడద నుంచి రక్షించుకోవచ్చు. ఈ నేపథ్యంలో వరి పంటకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై మండల వ్యవసాయాధికారి ఎస్. అవినాష్ పలు సూచనలు, సలహాలు అందించారు.

అగ్గి తెగులు – లక్షణాలు

వరి ఆకులు, కణుపులు, వెన్నుకు అగ్గితెగులు ఆశిస్తుంది. ఈ తెగులు నారు మడికి ఆశిస్తే నారు పూర్తిగా ఎండిపోతుంది. నాటుకున్న తర్వాత ఆశిస్తే ఆకులపై చిన్న చిన్న గోధుమరంగు మచ్చలేర్పడతాయి. అవి క్రమేపీ పెద్దవై నూలుకండె ఆకారంలో రూపుదిద్దుకుంటాయి. మచ్చల అంచు ముదురు గోధుమ రంగులో ఉండి, మధ్య భాగం బూడిద రంగులో ఉంటుంది. తెగులు పెరిగే కొద్దీ వరి మొక్కల ఆకులు ఎండిపోతాయి. పైరుకు నిప్పు పెడితే ఎలా ఉంటుందో అలా కనిపిస్తుంది. గాలి ద్వారా ఒక మొక్క నుంచి మరొక మొక్కకు తెగులు వ్యాప్తి చెందుతుంది.

నివారణ చర్యలు

అగ్గితెగులు నత్రజని ఎక్కువగా వాడడం వల్ల కూడా వస్తుంది. నత్రజని ఎరువు సిఫార్సు మేరకు వాడాలి. తెగులు నివారణకు లీటర్ నీటిలో 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందు కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేయాలి.



నాట్లు వేస్తున్న రైతులు

పాము పొడతెగులు – లక్షణాలు..

ఈ తెగులు ఆశిస్తే కాండంపై ఉన్న ఆకులమీద చిన్న గోధుమ రంగు మచ్చలేర్పడతాయి. అవి క్రమేపీ పెద్దవై పాము పొడ ఆకారంలో మచ్చలుగా మారుతాయి. మచ్చలు ఒక క్రమ పద్ధతిలో ఉండవు. ఈ తెగులు ఆశిస్తే పైరు పూర్తిగా ఎండిపోతుంది.

నివారణా చర్యలు

వరిచేను గట్లపైన కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఈ తెగులు లక్షణాలు కనిపించినపుడు ప్రొఫికొనజోల్ 1 ఎంఎల్ లేదా హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి సరిపడా పిచికారీ చేయాలి.

గోధుమరంగు మచ్చ తెగులు – లక్షణాలు..

ఈ తెగులు ఆశిస్తే ఆకులపైన గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. మధ్యభాగంలో బూడిద లేదా తెల్ల రంగులో ఉంటుంది. ఈ తెగులు మూడు దశల్లో ఆశిస్తుంది. మొదటి దశలో మొలక రాక ముందు వస్తే విత్తనాలన్నీ నేలపైకి రాకముందే కుళ్లిచనిపోతాయి. రెండోదశలో మొలకమీద గుండ్రని గోధుమ రంగు మచ్చలేర్పడి నువ్వు గింజ ఆకారంలో తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మూడో దశలో తెగులు వెన్నుకు సంక్రమిస్తుంది.



వరినారు

నివారణ చర్యలు

మాంకోజెబ్ 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి విత్తన శుద్ధి చేయాలి. సమతుల్యమైన ఎరువులు వాడుకోవాలి.

బ్యాక్టీరియా తెగులు..

నారుమడి దశలో బ్యాక్టీరియా తెగులు ఆశిస్తే ఆకులు పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. వరి మొక్కలు పిలకలు పెట్టే దశలో ఆశిస్తే ఆకులు చివరి నుంచి కింద వరకు పచ్చగా మారి ఎండిపోతాయి. ఉదయం 7 గంటల సమయంలో తెగులు సోకిన ఆకు నుంచి జిగురు పదార్థాం పైకి వస్తుంది. వెన్ను సమయంలో ఈ తెగులు ఆశిస్తే గింజలు కేళీలుగా మారుతాయి. వాతావరణంలో అధిక తేమ ఉన్నపుడు ఈ బ్యాక్టీరియా తెగులు వ్యాపిస్తుంది.

నివారణా చర్యలు..

ఈ తెగులు 5 శాతం కంటే ఎక్కువగా కనిపిస్తే నత్రజని ఎరువు త్కాలికంగా నిలిపివేయాలి. తెగులు కనిపించిన వెంటనే స్ట్రెప్టోమైసిన 200 పీపీఎం మందును 15 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేయాలి.

పొట్టకుళ్లు తెగులు – లక్షణాలు..

వరి చేను పొట్ట దశలో ఉన్నప్పుడు ఈ తెగులు సోకుతుంది. కీటకాలు మొక్కలపై చేసే గాయాల ద్వారా ప్రవేశించి వెన్నును ఆకుల లోపలి నుంచి పూర్తిగా బయటకు రానివ్వవు. వరి వెన్ను సగభాగం మాత్రమే బయటకు వచ్చి మిగతా సగభాగం పొట్టాకుల్లో ఉంటుంది. పొట్టాకు కింది భాగంలో గోధుమరంగు మచ్చలేర్పడతాయి. దీంతో గింజలు కాఫీ లేదా నలుపు రంగుల్లోకి మారుతాయి.

నివారణాచర్యలు....

పైరు పొట్టదశలో ఒకసారి లీటర్ నీటిలో గ్రాము కార్బండిజం 0.5 శాతం మందు కలిపి పిచికారీ చేయాలి.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే విజయచంద్ర



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

సీతానగరం : పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను (గిరిజన ప్రతిభా విద్యాలయం) ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహ విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, బార్నాల సీతారాం, బి.లక్ష్మణరావు, పోల తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

117 మందికి కౌన్సెలింగ్

పార్వతీపురం టౌన్: ఈ సెట్ ప్రవేశాలకు సంబంధించి ఆదివారం స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో 117 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ విలియం క్యారీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాలను ఈ నెల 10 వరకు పరిశీలిస్తామన్నారు. తొలి, రెండు, మూడు రోజుల్లో 510 మంది ధ్రువపత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘తప్పెవరిది’ బాలల కథా సంపుటి ఆవిష్కరణ

పార్వతీపురం టౌన్: నాణ్యమైన బాల సాహిత్యానికి కేరాఫ్ అడ్రస్ నారంశెట్టి అని జట్టు వ్యవస్థాపకుడు, కళారత్న డాక్టర్ డి. పారినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జట్టు సమావేశ మందిరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన ‘‘తప్పెవరిది’’ బాలల కథా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పారినాయుడు మాట్లాడుతూ.. బాలసాహిత్య పుస్తకాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి పాఠశాలలు, గ్రంథాలయాలకు సరఫరా చేసినప్పుడే పిల్లలకు మంచి అలవాట్లు, మంచి లక్షణాలు అలవడతాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మాట్లాడుతూ.. నారంశెట్టి రచనలు పిల్లల మనసుల్ని దోచుకునేలా ఉంటాయని కొనియాడారు. రచయిత నారంశెట్టి మాట్లాడుతూ.. తాను రచించిన తప్పెవరిది కథా సంపుటిని జట్టు ఆఫీస్‌లో ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నటుడు, రచయిత రౌతు వాసుదేవరావు, బాలసాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు, చిత్రకారుడు తుంబలి శివాజీ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, వ్యవసాయ పుస్తకాల రచయిత టి.శివకేశవరావు, అల్లువాడ కైలాసరావు, పక్కి రవీంద్రనాథ్, పి. గౌరీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



బాలల కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న జట్టు వ్యవస్థాపకుడు డాక్టర్ డి. పారినాయుడు

జీవశాస్త్ర ఉపాధ్యాయుల నూతన కార్యవర్గం ఎన్నిక



జీవశాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా చొక్కాపు శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా చుక్క ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా జొన్నాడ సురేష్, ఉపాధ్యక్షులుగా రవికుమార్, రాజా గణేష్, అప్పలనాయుడు.. కార్యదర్శులుగా బి. జోగారావు, బి. కాశీవిశ్వనాథం, వి.కృష్ణవేణి, ప్రసన్నకుమార్.. కోశాధికారిగా పాత చంద్రమౌళి, మహిళా ప్రతినిధిగా జానకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పెంట రామకృష్ణ, గంటా సోమశేఖరరావు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ ప్రధాన సలహాదారులుగా ఎం. భాస్కరరావు, నల్ల బాలకృష్ణారావు, సీహెచ్ రామకృష్ణ, ఎస్. మహేష్, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులుగా సీహెచ్ సత్యనారాయణ, రఘురాం, ఆర్. ఈశ్వరరావు, జి. రాజు, సాంకేతిక కమిటీ సభ్యులుగా వంశీకృష్ణ, బలరాం, చిప్పాడ సత్యనారాయణ, మురళి నియమితులయ్యారు. సమావేశానికి విజయనగరం జీవశాస్త్ర ఫోరం ప్రధాన బాధ్యులు బూరి వేణు, సన్యాసినాయుడు, సురేంద్ర, కృష్ణారావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర

మక్కువ : మండలంలోని సీబిల్లి పెద్దవలస, మక్కువ గ్రామాలలో జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. రథాన్ని పుష్పాలతో అలంకరించి ఉత్సవమూర్తులను ఉంచి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ పూడి రమణమ్మ దంపతులు, మాజీ సర్పంచ్‌లు తీళ్ల కిరణ్‌కుమార్, పూడి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు యామల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

కదిలిన జగన్నాథ రథచక్రాలు

సాలూరు: పట్టణంలోని వేంకటేశ్వర డీలక్స్ సమీపంలో గల జగన్నాథస్వామి ఆలయంలో నేత్రోత్సవ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు తొలిపూజ చేయగా.. అర్చకులు వినయ్, రాజు, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గర్భగుడిలో ఉన్న విగ్రహాలను రథం మీదకు తీసుకువచ్చి కోటవీధి జంక్షన్ మీదుగా గుండిచా దేవి మందిరం వరకు రథయాత్ర నిర్వహించారు. స్వామివారిని చూసేందుకు వేలాది మంది భక్తులు రావడంతో పట్టణం పులకించిపోయింది. స్వామివారిని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, నాయకులు ఆముదాల పరమేశు, నిమ్మాది చిట్టి, తదితరులు దర్శించుకున్నారు.



సాలూరు: స్వామి వారికి పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్



సాలూరు: జగన్నాథస్వామి రథయాత్ర



సాలూరు: జగన్నాథస్వామి రథయాత్ర



బలిజిపేట : వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో పూజలందుకుంటున్న స్వామివారు



మక్కువ: ఎస్.పెద్దవలసలో జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉత్సవాలు ప్రారంభం..

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఉన్న జగన్నాథస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టి, సాయంత్రం రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు కాపాడాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు

పార్వతీపురం టౌన్: నూతన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్మిక సంఘాల విస్తృత సమావేశం ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా ట్రెజరర్ గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, కర్షక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగానే దేశంలో బీజేపీకి ఎంపీ స్థానాలు తగ్గాయన్నారు. అయినా బీజేపీ తన పాలనా విధానాలను కొనసాగించడానికి నిశ్చయించుకుందని మండిపడ్డారు. బీజేపీకి అండగా రాష్ట్రంలో పాలక ప్రతిపక్షాలు నిలవడం బాధాకరమన్నారు. కార్మికుల పని గంటలు తగ్గించడం, పీఎఫ్ చెల్లింపులు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మిక హక్కుల సాధనకు ఈ నెల పదో తేదీ ఉదయం పది గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద.. సాయంత్రం అన్ని మండలాల్లో నిరసన ధర్నాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈమేరకు ర్యాలీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి. సూరిబాబు, ఎం. శివానీ, మామిడి శివ, జి.కృష్ణతో పాటు మున్సిపల్ ఆశ, సీహెచ్‌డబ్ల్యూ గ్యాస్, రైస్‌మిల్లు తదితర సంఘాల నాయకులు.శివని, మండంగి.హరనాథ్, జి.దమయంతి, శనపతి గౌరమ్మ, సీహెచ్ మురళి, జి. కృష్ణ, బి.వెంకటరమణ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బలిజిపేట : మండలంలోని అంపావల్లి – వంతరాం మధ్యలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రాజాం నుంచి బలిజిపేట వస్తున్న ఆర్టీసీ బస్సును.. బలిజిపేట నుంచి వంతరాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శంకరరావు, సూర్యనారాయణలు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో శంకరరావు, సూర్యనారాయణలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో క్షతగాత్రులను బలిజిపేట సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు.

కారు, బైక్ ఢీ..

పార్వతీపురం టౌన్: కారు, బైక్ ఢీకొన్న సంఘటన ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. నవిరి కాలనీకి చెందిన పట్నాన కుమార్ తన సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై పట్టణానికి వెళ్తుండగా.. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెనుక నుంచి వస్తున కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన కుమార్‌ను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదస్థలంలో సూర్యనారాయణ

ఘనంగా సాహితీ కార్యక్రమం



సుధాకుమార్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు, సాలూరు సాహితీమిత్ర బృంద సభ్యులు

సాలూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ పాఠశాల వద్ద సాలూరు సాహితీమిత్ర బృందం ఆధ్వర్యంలో 88వ సాహితీ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మిత్రబృందం అధ్యక్షురాలు రావాడ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్వతీపురం పట్టణానికి చెందిన డాక్టర్ పొందూరు సుధాకుమార్ ‘భాగవతం చదివితే బాగుండు’ అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితులకు భాగవత పఠనావసరాన్ని వివరించారు. అనంతరం సుధాకుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీమిత్ర బృంద సభ్యులు కర్రి వెంకటరావు, కూనిశెట్టి భీమారావు, జేబీ తిరుమలాచార్యులు, గొట్టాపు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, చావలి శేషాద్రిసోమయాజులు, ఆకుల గణపతి, మీసాల గౌరీశంకర్, పతివాడ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

పాలకొండ: మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దుప్పాడ పాపినాయుడు అధ్యక్షతన పాలకొండలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాజీ సైనికుల సమస్యలను తెలుసుకున్నారు. మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు, టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా విభజన కారణంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం మాజీ సైనికులు పూర్ణచంద్రరావును సన్మానించారు.

కోటదుర్గమ్మకు మొక్కుల చెల్లింపు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కోటదుర్గమ్మకు భక్తులు మొక్కులు చెల్లించారు. పాలకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఆదివారం పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఆలయానికి ఘటాలతో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. చల్లంగ చూడు కోటదుర్గమ్మ అంటూ దేవస్థానంలో ప్రణమిల్లారు. ఆషాడ మాసోత్సవాల్లో భాగంగా వారాహి నవరాత్రులను పురస్కరించుకుని అర్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

‘చదవడం మాకిష్టం’

గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో లైబ్రేరియన్ మధుసూదన్‌రావు పలు పుస్తకాలు చదివించారు. అర్థం చేసుకుంటూ పుస్తకాలు ఏ విధంగా చదవాలి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్యారంబోర్డు పోటీలు చేపట్టారు.